## క్లుప్తంగా

### ఉత్తరప్రదేశ్‌కు కార్మికుడి మృతదేహం తరలింపు

- మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు

ఖిలా వరంగల్: ఇటుకల తయారీ కంపెనీలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్ బోల్తాపడటంతో వలస కార్మికుడు అక్కడిక్కడే దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. మృతుడి భార్య, పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కాందారి గ్రామానికి చెందిన ఎండీ.షరీఫ్ అలీ (28), షాబిక్ ఉన్నీసా దంపతులు తమ ముగ్గురు పిల్లలను తీసుకుని ఖిలా వరంగల్ మండలం నక్కలపెల్లి గ్రామానికి వలస వచ్చారు. ఓ ప్రజాసంఘాల ప్రతినిధి ఏర్పాటు చేసిన ఇటుక బట్టిలో షరీఫ్ డ్రైవర్‌గా, షాబిక్ ఉన్నీసా కార్మికురాలిగా పని కుదురుకున్నారు. రోజువారీ పనుల్లో భాగంగా బుధవారం సాయంత్రం షరీఫ్ అలీ.. ట్రాక్టర్ ఇంజిన్‌తో రేగడి మట్టిని తొక్కుతున్నాడు. ఆకస్మాత్తుగా ట్రాక్టర్ బోల్తా పడడంతో ఇంజిన్ కింద షరీఫ్ పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న మామునూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య షాబిక్ ఉన్నీసా ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం షరీఫ్ అలీ మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉత్తరప్రదేశ్‌కు తరలించినట్లు వివరించారు.

### కారు బొమ్మ బహూకరణ



కారు బొమ్మను అందజేస్తున్న సంపత్

హన్మకొండ: హనుమకొండ 8వ డివిజన్‌లోని కుమార్‌పల్లికి చెందిన రుద్రోజు సంపత్.. బీఆర్ఎస్‌పై తనకున్న అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నారు. ఈమేరకు ప్రచారంలో పాల్గొన్న పార్టీ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ సతీమణి దాస్యం రేవతికి గులాబీ రంగు గల కారుబొమ్మపై కేసీఆర్, కేటీఆర్‌తో పాటు వినయ్‌భాస్కర్ ఫొటోలను అంటించి అందజేశారు. కారు గుర్తుకే ఓటేయాలని కారు బొమ్మతో ప్రచారం నిర్వహించారు.

### బీసీ సీఎంను ప్రకటించిన బీజేపీకి అండగా నిలవాలి



అభివాదం తెలుపుతున్న నాయకులు

హన్మకొండ: బీసీ సీఎంను ప్రకటించిన బీజేపీకి బీసీలంతా అండగా నిలవాలని బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు పిలుపునిచ్చారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని అభిరాం గార్డెన్‌లో బీసీల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. ఈ సమ్మేళనంలో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల నుంచి బీసీ సంఘాల నాయకులు, బీసీలు పాల్గొన్నారు. బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోవ లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనాల్సి ఉండగా ప్రతికూల వాతావరణంతో హెలికాప్టర్ వచ్చే అవకాశం లేకపోవడంతో ఆయన పాల్గొనలేక పోయారు. ఈ సందర్భంగా వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ పార్టీలకు, సంఘాలకు అతీతంగా బీసీలంతా కలిసికట్టుగా ఉండి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమ్మేళనంలో బీజేపీ, ఆయా సంఘాల నాయకులు చొల్లేటి కృష్ణమాచారి, నాగపురి రాజమౌళి, దేశిని సదానందం, రావుల కిషన్, వన్నాల వెంకటరమణ, గురుమూర్తి శివకుమార్, కందగట్ల సత్యనారాయణ, భరత్‌గౌడ్, తాళ్లపల్లి కుమారస్వామి, రాజేంద్రప్రసాద్, కుసుమ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### నేతాజీ ఫార్మసీ కళాశాలలో రక్తదాన శిబిరం



సోమిడిలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కాజీపేట: 62వ నేషనల్ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట 62వ డివిజన్ సోమిడి శివారులోని నేతాజీ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని కళాశాల కార్యదర్శి ఇనుగాల రాకేష్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందితో పాటు విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు రాకేష్‌రెడ్డి ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆయన అన్నారు. అపోహలు వీడి రక్తదానం చేయడానికి అర్హులు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాబురావు, డాక్టర్లు శ్రీకాంత్, ఎండీ.రవూఫ్, పావని, భార్గవిలత, ధరణి, సునీల్, అనిల్‌కుమార్, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా..



హన్మకొండ: జయశంకర్ స్మృతి వనంలో వాకర్స్‌కు అభివాదం చేస్తున్న వినయ్‌భాస్కర్



కాజీపేట: మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్మృతివనంలో వాకర్స్‌తో వాక్ అండ్ టాక్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులో నడుస్తూ వాకర్స్‌తో ముచ్చటించారు. కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధిలో వాకర్స్‌ది కీలక పాత్ర అని గుర్తుచేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి**

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలని దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్, గోపా జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజుతో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు పార్టీలోకి కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్ గౌడ్, నాయకులు విద్యాసాగర్, వినోద్, మల్లయ్య, బచ్చు ఆనందం, జనగాం శ్రీనివాస్ గౌడ్, పులి మోహన్‌గౌడ్, అరుంధతి, రమేష్ గౌడ్, మోహన్, భానుప్రకాష్, అనిల్, బండి నారాయణ, ఆరెల్లి ధనుంజయ్, శ్రీకాంత్, మోటపోతుల రాజ్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

**నన్ను మళ్లీ గెలిపిస్తే అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తా..**

కాజీపేట: ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేస్తున్న తనను మరోమారు గెలిపిస్తే నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట పట్టణంలోని పలు కాలనీల్లో కార్యకర్తలతో కలిసి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ నగర్ కాలనీలో పలు పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి వినయ్‌భాస్కర్ ఆహ్వానించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్, అయ్యాల దానం, తేలు సారంగపాణి, సుబ్బు, విజేందర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను వెంటనే పరిష్కరిస్తా



ప్రచారంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



కాశిబుగ్గ: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రదీప్‌రావు

- బీజేపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కరీమాబాద్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న తనను గెలిపించిన వెంటనే వాటిని పరిష్కరించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రేటర్ పరిధిలోని 40వ డివిజన్ మైసమ్మ గుడి, ఎస్సీ వాడ, కుమ్మరివాడ, ఉర్సు బొడ్రాయి, చక్రాలగడ్డ ప్రాంతాల్లో గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాడవాడలు తిరుగుతూ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను ప్రజలకు వివరించడంతో పాటు సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఇక్కడి ప్రజలను ఓటర్లుగానే చూశారే తప్ప ఈ ప్రాంతానికి వారు చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను చూసిన ప్రజలు.. ఈసారి బీజేపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

**బీజేపీలో చేరికలు**

కాశిబుగ్గ: 37వ డివిజన్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు గురువారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆహ్వానించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తేనే తూర్పు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పార్టీలో చేరిన వారిలో బాసబోయిన రాజు, సిరబోయిన శ్రీనివాస్, సిరబోయిన నర్సింగం, రవి, జనార్దన్, సూరయ్య, భిక్షపతి, గణేష్, మొద్దు సూరయ్య, పాపయ్య, సార మల్లేషం, రాజు, నరేష్, అశోక్, కృష్ణ తదితరులు ఉన్నారు.

# 'భద్రకాళి'ని దర్శించుకున్న వేణుమాధవ్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్: భద్రకాళి అమ్మవారిని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్ వేణుమాధవ్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషభారతి ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ముందుగా ఆది శంకరులు, వల్లభ గణపతిని వేణుమాధవ్ దర్శించుకుని ఆ తర్వాత అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం, ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి మహాదాశీర్వచనం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్లు లావణ్య, రవిప్రసాద్, ఆడిటర్లు సదాలక్ష్మి, దయానంద్, సనత్ ఆనంద్, ప్రణయ్‌కుమార్, నాగరాజు, రమ్యకృష్ణ, అక్షయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శేషవస్త్రాలు అందజేస్తున్న ఈఓ శేషభారతి

## నేడు తులసీధాత్రి నారాయణుల కల్యాణం

హన్మకొండ కల్చరల్: కార్తీకమాసం ద్వాదశి తిథిని పురస్కరించుకుని రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో శుక్రవారం తులసీధాత్రి నారాయణ (ఉసిరిక)ల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం, స్వామివారికి అన్నపూజ, భక్తులకు అన్న ప్రసాదాల వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

**నేడు మంగళకైశిక ద్వాదశి పూజలు**

టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా శుక్రవారం మంగళకైశిక ద్వాదశి పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ డీపీపీ జిల్లా బాధ్యుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు. వరంగల్‌లోని బాలాజీనగర్, హనుమకొండ, కాజీపేట, గోపాల్‌పూర్‌లోని మాలధారులైన మిత్తల్ అయ్యల్‌వార్లు ఉన్న ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు వివరించారు.

## సాంఘిక సంక్షేమ మహిళా గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

విద్యారణ్యపురి: హనుమకొండలోని హంటర్‌రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలల్లో పీజీ కోర్సులైన ఎమ్మెస్సీ స్టాటిటిక్స్, ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో ఖాళీగా ఉన్న సీట్లుకు ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు మహిళా గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దయాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 50శాతం మార్కులతో సాధించిన విద్యార్థినులు అర్హులని, వివరాలకు హంటర్‌రోడ్డులోని పెట్రోల్‌బంకు సమీపంలో ఉన్న మహిళా గురుకులంలో లేదా 79950 10676 ఫోన్ నంబర్‌లో గాని సంప్రదించాలని కోరారు.

# మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలి



మాట్లాడుతున్న సామల ప్రదీప్‌కుమార్

నయీంనగర్: ప్రజల బాగు కోసం, సమాజంలో మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యూఎస్ఏ వర్కింగ్ ప్రెసిడెంట్, ఓవర్సీస్ కాంగ్రెస్ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ సామల ప్రదీప్‌కుమార్ కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనలో ఎన్నారైలు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. అన్ని వర్గాల ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ సిద్ధించిందని అన్నారు. ఇది ఏ ఒక్కరి సొంత ఆస్తి కాదని తేల్చిచెప్పారు. తామే తెలంగాణను తీసుకువచ్చినట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి రెండుసార్లు అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారవు. బీఆర్ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు.. స్వచ్ఛందంగా కాంగ్రెస్ వైపునకు మొగ్గు చూపుతున్నారని వివరించారు. తెలంగాణలోని అన్ని వనరులను దోచుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ వీఎస్.రాజ్‌కుమార్, కే.గురుప్రసాద్, జీ.శ్రీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పద్యనాటక కళాకారుడికి సన్మానం



శర్మను అభినందిస్తున్న రమణాచారి, తదితరులు

హన్మకొండ కల్చరల్: హైదరాబాద్ సరసిజ థియేటర్ ఫర్ విమెన్, లేఖిని రచయిత్రుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నగరానికి చెందిన ఓరుగల్లు శారదా నాట్యమండలి సభ్యుడు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'మహానటుడు' నాటకాన్ని గురువారం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సలహాదారు రమణాచారి, సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రముఖ కళాకారిణి నశ్రీన్ అతిథులుగా పాల్గొని మహానటుడు పాత్రధారి, నాట్యమండలి కార్యదర్శి జేఎస్.శర్మను సన్మానించారు. పేద కళాకారుడి నాటి, నేటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు తన నటనతో అలరించారని శర్మను పలువురు అభినందించారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని జవహర్‌కాలనీలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వారి నుంచి రూ.50,280 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం నిందితులు సప్తగిరి కాలనీకి చెందిన సూర నాగరాజు, పైడిపల్లికి చెందిన బానోతు రాజు, కోమటిపల్లికి చెందిన మలోతు రమేష్, పాలకుర్తికి చెందిన గుంజె రాజు, వడ్డెపల్లికి చెందిన కొమ్మురాజుల మల్లేష్, ధర్మసాగర్‌కు చెందిన కొండెం శ్రీధర్‌రాజును అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

# మెట్టుగుట్టపై కార్తీకమాస పూజలు

- ఆకాశదీపాన్ని వెలిగించిన అర్చకులు

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉదయం సంప్రోక్షణ అనంతరం స్వామివారికి ప్రభాత సేవతో పాటు గోపూజ, అఖండ దీపారాధన, ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రామాలయంలోనూ స్వామివారికి విశేష అర్చనలు చేశారు. సాయంకాలం సంధ్యాసమయంలో హరిహరులకు ఆకాశదీపోత్సవం జరిపించి, శివాలయంలో ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వాహణధికారి శేషభారతి తెలిపారు. అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపల్లి సత్య నారాయణశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆకాశదీపం వెలిగిస్తున్న అర్చకులు, భక్తులు



# గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా



పర్వతగిరి: పెద్దతండాలో మాట్లాడుతున్న రమేశ్



పర్వతగిరి: ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

- కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అగ్రగామిగా..
- బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్

పర్వతగిరి : ఎమ్మెల్యేగా మరోసారి గెలిపిస్తే వర్ధన్నపేట నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ముంజాలకుంట తండా, పెద్దతండా, బూర్గుమళ్ల, మోత్యతండా, మంగ్యాతండా, రావూరు, అన్నారం, కల్లెడ, దూపతండా, పర్వతగిరి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు సార్లు గులాబీ పార్టీకి అధికారం ఇస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. 24గంటల విద్యుత్ సరఫరా, రైతుబీమా, రైతుబంధు, కల్యాణలక్ష్మి, వృద్ధులు, దివ్యాంగులకు ఆసరా పింఛన్లు ఇస్తూ ఆదుకోవడమే కాకుండా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేసినట్లు వివరించారు. 50ఏళ్లు పాలించిన పార్టీలు ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకపోగా కమీషన్లకే పరిమితం అయ్యారని విమర్శించారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పార్టీ అధికారంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేసిందని అన్నారు. ఎన్నికలు రాగానే కొత్త బిచ్చగాడిలా ప్రతిపక్ష నాయకులు గ్రామాల మీద పడి ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వారిని తరిమికొట్టి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తమ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న తనను గెలిపించాలని రమేశ్‌ను కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలు: మద్దతు తెలుపుతున్న వాసుదేవ రెడ్డి



మడికొండలో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు

**అరూరి రమేశ్‌ను గెలిపించాలని ప్రచారం**

మడికొండ : బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండలో కార్యకర్తలు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. మరోసారి అరూరి రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్, జీ.రాజు, రాసమల్ల వెంకటస్వామి, రాజు, కడమంచి మహేందర్, వల్లెపు ఉపేందర్, సాంబరాజు, రమేష్, విష్ణు, కల్యాణ్, రాకేష్, వినయ్, రోహిత్ పాల్గొన్నారు.

**దివ్యాంగుల సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కే**

ఐనవోలు : దివ్యాంగుల సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కే ఉంటుందని రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని పున్నేలు క్రాస్ సమీపంలోని ఓ గార్డెన్‌లో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అరూరి రమేశ్ హాజరై దివ్యాంగులతో ముచ్చటించి వారితో సెల్ఫీలు దిగి ఉత్సాహ పరిచారు. అనంతరం వారితో కలిసి భోజనం చేసి కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగులు విపరీతమైన బాధలు అనుభవించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సమస్యలు దూరమైనట్లు గుర్తుచేశారు. 100 శాతం సబ్సిడీతో దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని కొనియాడారు. కార్యక్రమంలో రుణ రైతు విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకన్న, దివ్యాంగుల రాష్ట్ర, జిల్లా నాయకులు జన్ను రాజు, మున్న, రవీందర్‌రావు, అరూరి రంజిత్, మంతుర్తి రమేష్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**అరూరి రమేశ్‌ను ఆశీర్వదించండి**

హసన్‌పర్తి : అరూరి రమేశ్‌ను ఆశీర్వదించాలని బీఆర్ఎస్ నాయకుడు సుదర్శన్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని దళిత కాలనీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారికి దళితబంధు పథకాన్ని వర్తింపజేయనున్నట్లు చెప్పారు. దశలవారీగా పథకం అందించనున్నట్లు వివరించారు. దళితుల సంక్షేమానికి బీఆర్ఎస్ అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పుట్ట రవి, బోడ యుగంధర్, ఆరెపల్లి పవన్, మేకల రమేష్ పాల్గొన్నారు.